'వింటున్నానండి-ఖూనీ అవుతున్నానండి!'

'ఇరవై నాలుగ్గంటలలోగా—'

'ఏం జరుగుతుందండి ఇరవై నాలుగ్గంటలలోగా?'

'ఆ గడియారం ముల్లు ఇప్పుడున్న చోటునించి రెండుసార్లు తిరిగి అక్కడికే వస్తుంది—'

'ఇది గొప్ప సత్యమండి'

'శేషయ్యా!'

'ప్రభూ!'

'ఇరవై నాలుగ్గంటలలోగా ఆ గడియారం ముల్లు రెండుసార్లు తిరిగి మళ్ళీ అక్కడికే రావడానికి వీల్లేదు—'

'వీలుందండి-'

'వీల్లేదనీ చెబుతున్నా-నా సంస్థానంలో ఇలాంటి ఆటలు సాగవు-'

'ప్రభూ!

'ఎంతమాత్రమూ వీల్లేదు. ఉంటే ఉన్నచోటనే ఉండమను లేకపోతే పొమ్మను. అంతేకాని, బయల్దేరిన చోటికే మళ్ళీ తిరిగి వచ్చేమాటైతే-శేషయ్యా-దాని గొంతుక నులిమేసి పారెయ్!'

## జహాంగీరు

'శేషయ్యా?'

'ప్రభూ! ఏమిటలా-?'

'నా ఆశలన్నీ భగ్నమైనాయోయ్-'

'చిత్తం! ఏం జరిగిందేమిటండి?'

'మన జహాంగీర్ విషయం-'

'...........?'

'అదేనోయ్-మనం కొత్తగా కొన్న పంచకల్యాణి-'

'చిత్తం చిత్తం! భలేపేరు పెట్టారండి—ఇంతకీ ఏం జరిగిందేమిట?'

'దీపావళినాడు తొలిసారి ఎక్కుదామని ముచ్చటపడ్డాను-'

'చిత్తం-ఇప్పుడేమండీ? ఎక్కొచ్చును—ఈవేళేగా దీపావళి?'

'శేషయ్యా! ఎలా ఎక్కమంటావోయ్? నా బాధలు నీకు అర్థమవుతాయా?'

'ప్రభూ! శాంతి వహించండి. ఏం జరిగిందో చెబితే...?'

'జహంగీరు పరిస్థితి ఏమీ బాగా లేదోయ్-'

'జబ్బాండి?'

'కాదు—'

'ఎక్కబోతే తంతున్నాడాండి?

'ఊహు—'

'కరవొస్తున్నాడా?'

'ఊహు—'

'మరేమిటండీ?'

'దీనంగా చూస్తూ, కళ్ళవెంబడి అశ్రుధారలు కారుస్తూ స్పృ లేనట్టుగా, విరక్తిగా నిలబడి వుంటున్నాడు—'

'కాస్త హెచ్చరించి, బుజ్జగించలేక పోయారా?'

'నా కాయశక్తులా ప్రయత్నించాను—అశ్వీక పరీక్షకుడు కూడా వచ్చి చూచి పెదవి విరిచాడు—శేషయ్యా' జహంగీరు ఏదో మనోవేదనలో బాధపడుతున్నట్టున్నాడు—'

'విచారించవలసిన విషయమేనండి-ఐనా, ప్రభూ! కొంచెం ధైర్యం వహించండి-గుర్రాలకు ఇలాంటి తిక్క—'

'తిక్క కాదు-మనోవ్యాధి అను—'

'చిత్తం! మనోవ్యాధే అనండి—అది ఎలా వొచ్చిందో అలాగే పోతుందండి—'

'ఇంతకీ ఈ దీపావళి ఘడియలలో నేను నా జహంగీరుపైన స్వారి చేసే అదృష్టం—'

'ప్రభూ! అధైర్యపడకండి—ఇంతకూ ఒక్క మనవి-జహంగీరు తన శాలలో ఒక్కడే వుంటున్నాడా?'

'అవును—ఒక్కటే'

'ప్రభూ!'

'శేషయ్యా!'

'గొప్ప పొరబాటు చేశారు—'

'ఏమిటది—ఏమిటోయ్ శేషయ్యా?'

'శుద్ధ చవట పెద్దమ్మ పని చేశారు—'

'నా మొహం! వెర్రివెధవని! ఏం చేశానో చెప్పు—'

'ప్రభూ పశ్చాత్తాపానికి వ్యవధిలేదు'

'మరి ఏం చెయ్యమంటావ్?'

'ఈ దీపావళి ఘడియలు దాటిపోకుండా మీకోరిక సిద్ధించాల్నంటే—'

'ఈ వేళ సాయంత్రానికైనా నేను నా జహాంగీరు నెక్కి షికారు చెయ్యాల్నంటే—'

'ఒక్కటే మార్గం—'

'ఏమిటదీ—త్వరగా?'

'తమరు వెంటనే ఒక నూర్జహానును వెతికి తెచ్చి జహాంగీరుకు కానుక పెట్టాలి—'

## కొత్త సలహాదారుడి నియామకం

'శేషయ్యా?'

'ప్రభూ!'

'ఎవరోయి ఈ అసామీ?'

'చిత్తం-బొంబాయినుంచి వచ్చాట్టండి-ఏవో టాయ్‌లెట్ సామాన్లు-పైపూతలూ, మెరుగులూ-తయారుచేసే కంపెనీకి ఏజంటుట్టండి-'

'ఏమంటాడు ఇంతకీ-'

'తన కంపెనీ సరుకులను ప్రోత్సహించమని తమర్ని వేడుకుందుకు వచ్చాట్టండి-'